ఓబయ్య

వేలూరి శివరామశాస్త్రిగారు, శతావధాని

౧.

ఆశ్రమము తయారాయెనుగాని అహోబలుఁడు దానిచే చిక్కులపాలాయెను. తలుపులను తీసినచో మఱి పడవు. ఎటులెటులో మూసినచో మఱి రావు. గద్దె మీఁద కూరుచున్నచో మఱి లేచుట కష్టము. లేచినచో మరి కూరుచుండుట కష్టము.

అది యాశ్రమముగనుక అందు పిట్టలును, పాములును విరోధములేక నివసించెను. వానిని హింసింపక బాలురు బయట నివసించుచుండిరి.

ఇది యిటు లుండఁగా పండుగు ప్రలయములు కలిసివచ్చినటులు గ్రామము లోనికి స్కూళ్ల యిన్స్పెక్టరు వచ్చెను. పంతులుగారి కానాఁ డహోబలుని యింట వారము. ఇన్స్పెక్టరుగారికిఁగూడ నచటనే వారము.

వీరవెంకమ్మ మెల్లగా వాకిటిలోనికిఁ జని జవానును బిలిచి ఇన్స్పెక్టరుగారి పేరు, ఊరు, హాల్ మకాము, జీతము, సంతానము, ఈమొదలగు విషయము లన్నియుఁ గనుఁగొనెను. మెల్లగా కాఫీకి నీళ్లుపెట్టి రెండిండ్ల పెత్తనము చేసి లోనికి వచ్చి ఇన్స్పెక్టరును జూచి 'నాయనా! సదాశివా! నీ వెవరో యనుకొంటిని, మాపుట్టింటివారువిస్సావఝులవారే నాయనా! నీ కెందఱు కూఁతుండ్రు? కొడుకు లెందఱు? భార్యను పిల్లలనుగూడఁ దీసికొనిరాక ఒంటరిగా వచ్చితివి?' అనెను.

ఇన్స్పెక్టరు మితరీతిగా ప్రత్యుత్తరము చెప్పెను. వీరవెంకమ్మ లోని కేఁగి కాఫీ తెచ్చి యిచ్చి 'నాయనా! నాకుమారుఁడు స్కూల్ ఫేలో యేదో, ఆఱవక్లాసు కాఁబోలు, ప్యాసయి కూరుచున్నాఁడు. గాంధిగారి మాట విని బడి మాని అదిగో ఆదొడ్లో ఆశ్రమము కట్టినాఁడు. అక్కడ ఒక బడిట! దానినిఁ గూడఁ జూచి పో. అది తప్పో ఒప్పో నాకు తెలియదు నాయనా!' అనెను.

'ఇపుడే చూచి వచ్చెద' నని అతఁడు కాఫీ త్రావెను. మిగిలినది చాటుగా జవాను త్రావెను. దానిలో మిగిలినది పంతులు త్రాగి ఇన్స్పెక్టరు ముందులకు వచ్చెను.

'ఈక్రొత్తబడిలో నెందఱు పిల్ల లున్నారు?'

'గ్రామములో పనిలేని పిల్ల లందఱును ఇచటనే యున్నారు.'

'గ్రాంటుకొఱకు మనకు దరఖాస్తు పెట్టుకొనలేదేమి?'

'ఇది స్వదేశీబడి కాదు; విదేశీబడియుఁ గాదు. ఇ దొకరకము.'

'అనఁగా?'

'ఈబడిలో పుస్తకములు లేవు. పుస్తక విద్యలో నహోబలుఁడుగారికి నమ్మిక తక్కువ. ఇచట భజన చేయుదురు. వీరికి భక్తి యెక్కువ. ఇచట బొమ్మలు గీయుదురు. కళలమీఁద మక్కువ.'

'ఇతనికి గ్రాంటు అక్కఱలేదా?'

'అక్కఱ యుండకపోవచ్చును.'

ఈసంభాషణ మయినపిదప ఇన్స్పెక్టరు గడియారము చూచి దుస్తులు ధరించెను. కనులకు జోడు పెట్టుకొనెను. ప్రేపబెత్తము చేతఁ బుచ్చికొనెను. చెప్పులు తొడుగుకొనెను జవాను ముందు ముందు నడచెను. ఇన్స్పెక్టరు వెనుక నడచెను.

'దారి యెక్కడికి తీయుమ'ని సెలవు?'

'ఆశ్రమములోనికి.'

పంతులు వీరవెంకమ్మను జూచి 'ఇన్స్పెక్టరుగారు మీపుట్టింటిపేరివారని నీ కెటులు తెలిసె నమ్మా?' అని యడిగెను.

'జవాను చెప్పెను నాయనా!'

'ఇన్స్పెక్టరుగారికి గారెలు చాల ఇష్టమని జవాను చెప్పినాఁడు విన్నారా?'

'అటులనా? ఒబ్బట్లు చేయఁదలఁచితిని. గారెలు గూడఁ జేయుదును.'

'మంచిది. మీయింట వడియములు అప్పడములు పెట్టినారా?'

'వెనుకటి వారమునాఁడు నీకు తినిన గుఱుతు లేదం?'

'అమ్మగారూ! నేను బడిలోనికి వెళ్లి మరల వచ్చెదను.'

'మంచిది నాయనా!'

జవాను మునిముం దేఁగి ఆశ్రమము లోపల నీరు ఎత్తి పోయుచున్న అహోబలుని గవాక్షమునుండి చూచి 'ఏమయ్యా! ఇన్స్పెక్టరుగారు దయచేసినారు' అనెను.

తనపనిలోఁ దాను మునిఁగి తేలుచు అహోబలుఁడు 'మంచిది' అనెను.

ఈ 'మంచిది' జవానుకు చెడ్డ దాయెను. ఇన్స్పెక్ట రంతవాఁడు స్వయముగా చూచుటకు రాఁగా బడిపంతులు 'మంచిది' అని గూడ వేసికొనుటయా! చేతులు కట్టుకొని యెదురుగా వచ్చి నిలుఁబడి గజగజలాడుచు నీళ్లు నములుచు చేతులు నులుముకొనవలసిన విధి కాదా? అర్ఘ్యపాద్యము లీయనక్కఱ లేదా? అహోబలుని ఔదాసీన్యము తనంత వానికిఁగూడ పరువుకాదు. తా నెవఁడు? 'ఇన్స్పెక్టరుగారి' జవాను!

ఆజవాను తనబిళ్లను ఎదురొమ్ముమీఁద తిన్నగా సవరించుకొనుచు 'నీకు గ్రాంటు వలదటయ్యా?' అనెను.

ఈప్రశ్నకును ప్రత్యుత్తరము బడయక అతఁడు వెను దిరిగిపోయి 'అయ్యా! ఇది స్వదేశీబడి' అనెను.

ఇన్స్పెక్టరు మాటాడక చుట్టునున్న ఆవరణమును జూచుటకు బయలుదేఱెను. కట్టవ

లోని ఛాయావృక్షములు ధీరులవలె తల లెత్తుకొని నిలువఁబడియుండెను. జీడిమావిళ్లు జవానులవలె వంగివంగి సలాములు చేయుచుండెను. కలేచెట్లు ఈఁటెలవారివలెఁ దవ్వులకుఁ గొట్టెను. పెడలపూలు ముక్కుద్రాళ్లు వోసి దాపులకు లాఁగుకొనియెను.

ఇన్‌స్పెక్టరు ముదముఁగొని ఆశ్రమద్వారముకడకు వచ్చెను. తలుపు పింకను తెఱవఁబడియుండలేదు. గౌరవలోపము లేకుండుటకు జవాను కొంచె మధికారమును ప్రయోగింపఁ జూచెనుగాని దొరకనుసన్నచే ఔదాసీన్యమును అలవఱించుకొనఁ దొడఁగెను.

ఇన్‌స్పెక్టరు ఆకట్టడమును క్రిందనుండి మీఁది కొకతూరి చూచి నివ్వెరపడెను. దాపీదు రోజీనా లెక్క చూచికొని పట్టుకొనిపోయి యెన్నినాళ్లో కాలేదు. చూపఱను భయపెట్టుటకుఁ బోలె ఆగోడలు మీఁదిమీఁదికి దుముకుచున్నటులుండెను. గవాక్షములును, తలుపులును మూయఁబడియున్నను ఆశ్రమగర్భములోనికి పిట్టలు రెక్కలు జాడించుకొనుచుఁ బరువెత్తుచుండెను. వాస్తుపురుషునకు కన్నులగు గూండ్లలో నొకటి చిబుకము మీఁదను మఱియొకటి పెడతలమీఁదను అమరియుండెను. సింహద్వారము ఈక్రింది పాటను అభినయించుచుండెను.—'ఓ చెలియా! ఓమగువా! నే తాళలేనే!'

ఇట్టి కట్టడపుఁ దలుపు దట్టఁబోయి ఇన్‌స్పెక్టరు వాతరోగివలె కాలిని వెనుకకుఁ బీఁకుకొనియెను.

'తేలు కుట్టినదా అండీ?'

'లేదు.'

'పక్షవాతము—'

'ఆ, కాదు.'

జవాను తెల్లఁబోయెను. ఇన్‌స్పెక్టరు కొంచెము నడచి దక్షిణపుగోడ గవాక్షముకడ నిలువఁబడెను. అది మూయఁబడియుండెను. లోపలినుండి పెద్ద ధ్వని వినఁబడుచుండెను. అతఁడు వంగి గూటిక్రిందఁ జూచెను. ఏదో కలుగు! దాని యుపయోగమును శంకించుకొని అతఁడు పరీక్షించుచుండెను. అంతలో గూడతో నీరు తోడు చప్పుడు వినఁబడియెను.

ఇన్‌స్పెక్టరు జవానును బిలిచి 'దీనిలోపల నూయి యున్నదా?' అని యడిగెను.

'లేదుగాని ఒకచోట చీలమండలలోఁతు నీరును మఱియొకచోట మోఁకాలిబంటి నీరును గలదు. వేసఁగిలో చల్లగానుండుటకు చిన్న చెఱు వేమేని కట్టించిరేమో యనుకొంటిని.'

ఇంతలో ఒక గూడెఁడునీరు ఆకలుగు చివరకు వచ్చి అతిథి ముఖము నవమానపఱచుట యెందుల కనియో కట్టిన పనివాని నేర్పరితనమును పాడొనరించుట యెందుల కనియో మరల లోనికే పోయెను.

మరల ఛటాత్కారము. ఊరెగిరిపోవునంత చప్పుడేకాని బయటికి వచ్చెడి నీ రొకదోసెఁడు.

ఇన్‌స్పెక్టరు కిది యెంతయు నగమ్యముగా నుండెను. అతఁడు ద్వారముకడ కరిగి 'అయ్యా! తలుపు తెఱవుఁడు' అని యాచించెను.

ఒకపిలుపునకు బదులు లేదు. పిలుపు మీఁద పిలుపుగా నాలుగయిదు పిలుపులకు 'ఆ' యను ప్రత్యుత్తరము వినఁబడెను.

'తలుపు ?'

అహోబలుఁడు తలుపుల కానుకొని ప్రయత్నించి ప్రయత్నించి గడియ తీసి మెల మెల్లగా నటునివలెను, కవాతు చేయువాని వలెను తప్పుకొనఁ దొడఁగెను. వెనుకకు బరుగెత్తు వెఱ్ఱి వానివలె రెక్కలు గబాలున విడఁ దొడఁగెను. అహోబలుఁ డాంజనేయునివలె వెనుకకు దుమికి, జాఱి వెనుకగోడ కానుకొనెను.

అహోబలుని ప్రయాణపు మంచమును ఇన్‌స్పెక్టరుగారికొఱకుఁ బఱిచి నీటిచెంబులను దాని క్రిందఁ బెట్టి జవానుకు పొగాకు సంపాదించి రొఁజుకొనుచు వచ్చి పంతులుగారు ఇన్‌స్పెక్టరుగారి ప్రక్క చేతులు జోడించుకొని లా అండ్ ఆర్డరులను పరిపాలించుచు నిలువఁబడిరి.

ఇన్‌స్పెక్టరును జూచి అహోబలుఁడు లోనికి ఆహ్వానించెను. అతఁడు భయసంభ్రమములతో లోని కడుగిడెను. అతని వెను వెనుకనే జవాను. జవాను వెనువెనుకనే పంతులు.

ఇన్‌స్పెక్టరు అహోబలుని జూచి యిటులనెను 'తెఱచుటకు ఒకయేనుఁగుబలమును ఉపయోగింపవలయుచో నిఁక మూయుట కెంతబల ముపయోగింపవలయునో!'

అహోబలుఁడు నవ్వి 'లోపలికి దయ చేయుఁడు' అనెను.

తాను ఇన్‌స్పెక్టరుకడ వేచియున్నటులు తెలుపుటకు ఇంతవఱకును పంతులుగారికి సందుదొరుక లేదు. ఇపుడు దొరుకఁగా నిటులనెను. 'పనివాఁడు ఈ తలుపులను బిగించి ననాఁడు గడియబెట్టుటకు ఊరెఁడుమంది పోగయిరి. ఈతలుపున కొకగడయు, ఆతలుపున కొకగడయు పోటీపెట్టి పదుగురు పదుగురుతలుపులు త్రోసి నొక్కిపట్టుకొనిరి. ఒకతలుపు ద్వారబంధమున కొకబెత్తెఁ డెడముగను మఱియొకటి జేనెఁ డెడముగను బోయెను. త్రోయఁగాఁ ద్రోయఁగా నొకపెద్ద చప్పుడు మొదలాయెను. గ్రామమునందలి కుక్కలేకావు, పందులేకావు జంతుజాల మంతయు పోగాయెను. తీవ్రవేదనతో, గూండ్రింపులతో, కొండకేకలతో తుదకు తలుపులు పడెను. ఇఁక గడియ బెట్టుట కొకఁడు భయపడుచు భయపడుచు బోయి ప్రక్కగడల లెస్సగా పరికించి వెనుకముందాడి గడలవారిని హెచ్చరించి దిగ్గన వేయఁ దొడఁగెను. అది పడుట కియ్యకొనక గోంగ్రుపెట్టెను. గడలవారు గోంగ్రునకు భయపడి పట్టువదలిరి. గడియవయిచువాఁ డిపుడు ఆసుపత్రిలో కోలుకొనుచున్నాఁడు లెండు!' అనెను.

ఇన్‌స్పెక్టరు అహోబలుని జూచి 'నేను నిర్భయముగా లోనికి రావచ్చునా?' అనెను.

జవాను వెంటనే యిటులనెను 'అయ్యా, ఇది సీమెంటు చప్టా కాదు. నాఁచు చప్టా. దీనిలో గుంటలు చెలమలు చెఱువులుగూడ నున్నవి! అదిగోఁ బంకిఁ జూడుఁ డ'ని నివ్వెరపడెను.

ఇన్‌స్పెక్టరు క్రిందుమీఁదులు చూచి ముందరికాలు వెనుకకుఁ బెట్టి వెనుదిరిగి గబగబ వాకిటిలోనికి వచ్చి యొక నిట్టూరుపు విడిచెను. జవానును పంతులును భయపడి ఇన్‌స్పెక్టరుకడకుఁ బాఱిరి.

పంతు లిటు లనెను 'ఈయూరిలో యమబ్రహ్మలు—

'యమబ్రహ్మ లేమిటండీ? మయబ్రహ్మలు కాదా?' అని జవాననెను.

'ఆ, ఇరువురు! ఒకఁడు దావీదు, రెండు, సుబ్బన్న. పూర్వము ధర్మరాజునకు మయుఁడే కట్టెను. ఇపు డహోబలుఁడుగారికి దావీదు సుబ్బన్నలే కట్టిరి.'

'గ్రామములోనివారిపట్ల ఆమాత్ర మభిమానము వల దటండీ?' అని యనుచు అహోబలుఁడు వెలికివచ్చి దాపున నున్న చెట్టుక్రింద కూరుచుండుటకుఁ జాఁప పఱిచెను.

ఇన్‌స్పెక్టరు వెఱ్ఱిచూపుతో పదిగజములు వెనుకకుఁ బాఱి 'దీని నెందులకుఁ గట్టించితిరి?' అని యడిగెను.

'ఇది యొక పాఠశాల!'

'బాలురనుమాత్రము దీనికి పదిగజముల యెడమునఁ గూరుచుండఁ బెట్టుఁడు. యముఁడొక్కొక్కమా టొక్కొక్క ప్రాణమే కొనును; ఇది యొక్కమాటే పలువుర ప్రాణములఁ గొనును'

'వడిగనే మరమ్మతు చేయింతును.'

'మరమ్మతా? పడఁగొట్టి మరలఁ గట్టించుటయే దీనికి మరమ్మతు. మఱియు దీనిని బడగొట్టింప నక్కఱలేదు. నేఁడో రేపో తనంతటఁదానే పడిపోవును.' అని యిన్‌స్పెక్టరు పలుకుచుఁ బలుకుచు అహోబలుని చేయి పట్టుకొని పదిగజముల దవ్వులాఁగుకొనిపోవు లోపల ఆయాశ్రమపు తూర్పుగోడ పెళపెళమని భూశయన మొనరించెను.

౧౭

ఇన్‌స్పెక్టరు భుజించి నిదిరించెను. సాయంకాల మయిదుగంట లయినతరువాత బడిని బరీక్షింప బయలుదేఱెను.

కొందఱు బాలురు వాగులలోను, పసుల పాకలలోను దాఁగిరి. కొందఱు అటకలమీఁది బోనపు పెట్టెలలో దాఁచిన లాగుచొక్కాలు ధరించిరి. కొందఱు అహోబలుని యిల్లు తొంగి తొంగి చూచుచు అటు, ఇటు, నడయాడఁ దొడఁగిరి.

బడి నేఁడు నిండిన యేటివలె నుండెను. నేఁడు రమారమి నలుఁబది యేండ్ల యీడుగ

లవారు మొదలుకొని నాలుగేండ్ల యీడుగల వారి వఱకును గల విద్యార్థులచే బడి కిటకిట లాడిపోవుచుండెను.

నలుఁబదేండ్లవారి ముచ్చట కొంచెము ఇచట చెప్పఁదగియున్నది. వా రసలు కూరఁగాయలు అమ్ముకొనువారు. వారు ఇపుడు 'డట్' ప్రత్యయమువలె సంఖ్యాపూరకులు, వా రీనాఁడే యీబడిలోనికి వచ్చిరి. ఈనాఁడే పండితులవలె బడిని విడనాడఁగలరు. ఈనాఁడుమాత్ర మిచట ముడ్డి మోపుటకు ఎనిమిదణాలు కూలినేర్పాటు చేసికొని బడిలోనికి వచ్చిరి.

ఇన్‌స్పెక్టరుగారు తమ సనాయనిశానీలతో వచ్చి కుర్చీలోఁ గూరుచుండిరి. వారు ముక్కాఁకలు తీరినవారు. వారు లోఁగడ కఠిన పరీక్షలు చేసిచేసి విసివిరి. ఇపుడు స్థాలీపులాకముగా పరీక్షలు చేసిపోవుచుందురు. వారు కనులకు జోడుపెట్టుకొని బాలురవంక నొకసారి ముఖము త్రిప్పిరి. బాలురందఱును ఘెఱుమును చూచినటు లయినదిగాని వృద్ధబాలురు మాత్రము ఇన్‌స్పెక్టరు గారికి తమ కౌతుకమునే స్వాగత మొనరించిరి.

'పంతులూ! హాజరుపట్టీ యేదీ?' అని ఇన్‌స్పెక్టర డిగెను.

పంతులు హాజరుపట్టీని చేతులతోఁ బట్టుకొని నిలువఁబడెను.

ఇన్‌స్పెక్టరు తీసికొని తెఱచి 'పుల్లయ్యా' అని బిగ్గరగా అనెను.

ఈపుల్లయ్య వృద్ధబాలుఁడు. అతఁడు తడఁబడెను. పంతులు అతనిని కఱకుగాచూచెను. పుల్లయ్య పెదవులు కొఱికికొని 'పంతులు చెప్పిన మాట మఱచాను' అని గొణుగుకొని తుదకు ('పెంట–పెంట–సార్') అనెను.

వెంటనే పంతులు 'ప్రెజెంట్ సార్' అనెను. వృద్ధబాలు రందఱును నవ్వి 'ప్రెజెంట్ ప్రెజెంట్' అని అనిరి. పిదప ఇన్‌స్పెక్టరు 'రామయ్యా' అనెను.

ఈ వృద్ధబాలురలో రామయ్య యనువాఁడొకఁడును లేఁడు. రమణయ్య యనువాఁడు కలఁడు. అసలు రామయ్య ఊరికి పోయెను. 'శేషమువలన గుఱుతు' దవులు నని తలఁచి 'రామయ్యా'అని పిలువఁగనే 'ప్రెజెంట్ సార్' అని చెప్పుమని పంతులు రమణయ్యకుఁ జెప్పెను. కాని రమణయ్య ఇన్‌స్పెక్టరుభూతము ముందది యంతయు మఱచెను.

వృద్ధబాలు రొకరిమొగ మొకరు చూచుకొని 'మాలో రామయ్య యెవరూ లేరండీ' అనిరి. పంతులు రమణయ్యను చూచెను.

'వా టీ జిట్?' అని ఇన్‌స్పెక్ట రనెను.

అపుడు రమణయ్య 'ఆపుసెంట్ సార్' అనెను.

'ఆపుసెంటు కాదు; 'ప్రెజెంట్ సార్' అని పంతు లనెను.

రమణయ్య 'ప్రెజెంట్ సార్' అనెను.

తరువాత ఇన్‌స్పెక్టరు కనులజోడు సర్దుకొని అతిగంభీరముగా పంతులుగారి మోము తిలకించి 'వేంకటేశ్వర్రావ్' అనెను.

ఎవరును మాటలాడకముందే పంతులు 'ప్రెజెంట్ సార్' అనెను.

పిదప ఇన్‌స్పెక్టరు హాజరు పట్టీలోని పేళ్లన్నియు చదువుచుండఁగా పంతులు 'ప్రెజెంట్‌సార్' అని చెప్పఁ దొడఁగెను. తుదకు ఆపరీక్ష ఆఖరాయెను. ఇన్‌స్పెక్టరు కొంచెము సేపటిటు చూచి 'పంతులూ! ఈయేడు పంచాంగము చూచితివా?' అనెను.

'చిత్తము.'

'వృశ్చికవృద్ధియెంత?'

'పదమూఁడు.'

'తన్నాశము?'

'ఒకటి.'

'మంచిది' అని ఆ యిన్‌స్పెక్టరు బాలురకు మార్కులు వైచి ఆకాకిత మచటఁ బెట్టి వాకిటిలోనికి వెళ్లెను. పంతులు ఆకాకితమును జూచుచుండఁగా నతనిముఖ మంతయు కలకలలాడుచువచ్చెను.

వెంకయ్య యను బాలుఁ డొకఁడు లేచి 'మేష్టార్! నేను ప్యాసయినానా?' అని యడిగెను.

'ఆ ప్యాస్.'

'నేను?' అని వెంకటరామయ్య అడిగెను.

'ప్యాస్.'

'నేను నేను నేను' అని బాలు రందఱడిగిరి. 'ప్యాస్ ప్యాస్ ప్యాస్' అని పంతులు ప్రత్యుత్తరించెను. అడుగనివారు వృద్ధబాలురు. కాని 'మే మింక వెళ్లవచ్చునా?' అని వారడిగిరి.

'ఉండుఁ డుండుఁడు' అని పంతులు వేలితో సైగచేసెను. ఇన్‌స్పెక్టరు వడివడిగా లోనికిఁ బరువెత్తుకొని వచ్చి 'ఊరు తగులఁబడిపోవుచున్నది, ఊరు తగులఁబడిపోవుచున్నది; ఇక్కడ పెద్దపెద్ద పిల్లలున్నారు, వెంటనే చల్లార్పుఁడు, పరుగెత్తుఁడు, పొండు' అని యఱచి చెప్పుచుండఁగా ఆబడి యంతయు శూన్యమయిపోయెను.

ధూమజాలము ఊరంతయుఁ జుట్టుకొనియెను. రత్నగర్భ పగిలి వెలిఁ గ్రక్కు రత్నములవలె స్ఫులింగములు దోఁచెను. స్ఫోటశబ్దముతో లేచిన పన్నగరాజు పడగలవలె మంటలు లేచెను. ధూమశిఖావచూడమగు నామహాజ్వాల భూమ్యాకాశములకు నిచ్చెన కట్టెను.

పశువులు తోఁకమట్ట లెత్తుకొని యిండ్ల చుట్టు తిరుగాడఁ దొడఁగెను. పిల్లలు తల్లుల కాళ్లకు సంకెల లయిరి. ఇండ్లన్నియు కొల్లగొట్టఁబడినటులు వాకిండ్లు సామానులతో నిండెను.

మంట లార్పుకొనుట మాని యెవరికి దొరకిన సామాను వారెత్తుకొని పోఁజొచ్చిరి.

గ్రామము నంతయు అగ్ని అరాచక మొనరించెను. బ్రాహ్మణు లగ్నిసూక్తములు పఠించి ఆజ్యము నాహుతి చేయఁగడగిరి. అగ్నిదేవుఁడు వారిభక్తి కానందించి వారిహస్తములను స్పృశించి యాలింగనము చేసికొనరాఁ దొడఁగెను.

పలువురు తెల్లఁబోయి చూచుచుండిరి. ఆఱుపుటకుఁగాని, తడుపుటకుఁగాని యొకఁడును ప్రయత్నింపఁ దలఁచుకొనలేదు.

అపు డహోబలుని బడిలోని బాలుగంధఱు చేతులతో కుండలు తీసికొని బయలుదేఱిరి. చెఱువుకడనుండి యిండ్లవఱకును ఇరువదేసి గజముల కొక్కనివంతున నిలువఁబడిరి. కుండతరువాత కుండ, కుండ తరువాత కుండగా నీరు వచ్చి పడుచుండెను.

ఇన్స్పెక్టరు ఆపిన్నవారి నియతిని జూచి యాశ్చర్యపడెను. బజారులలో బేజారుపడి చూచుచుఁ జూచుచు నిలువఁబడియున్న పెద్దవారు వారిని జూచి 'ఓరీ! మీకు ప్రాణముల మీఁద ఆశ లేదటరా?' అని విముఖులను గావింపఁ దొడంగిరి. ఇన్స్పెక్టరునకు కసి పుట్టెను. 'అమ్మ పెట్టనుపెట్టదు; అడుగుకొని తిననయినను తిననీయదు' అనునటులు మీరు చేయకపోవఁగా చేయువారినిగూడ చీలఁదీయుదు రేమయ్యా? ఈపిన్నవారిని జూచిన మీకు సిగ్గగుట లేదయ్యా? చాలుఁజాలు, మీరుగూడ కడవలఁ గొనిరండు' అని ఇన్స్పెక్టరు ఆపెద్దవారిని హెచ్చరించెను. 'అగ్నిదేవుని ఆగ్రహము చల్లాఱవలయునుగాని మన చేతులతో ఆర్పవచ్చునండీ? ఆర్పఁగలమటండీ?' అని ఆపెద్దలు ఇన్స్పెక్టరుకు సుద్దులు చెప్పిరి.

'భక్తిశాస్త్రమునుండి వచ్చిన యీవాసన సోమరుల నందఱను పట్టుకొనియున్నది. ఇది యెటనుండి పుట్టెనో ఎచటనెచట వ్యాప్తమాయెనో ఎచట నెలకొనెనో యేరి కెఱుక? ఛీఛీ! ఈగ్రామ మిఁక దగ్ధ మగుఁగాక!' అని ఆయిన్స్పెక్టరు ఒక కడవఁ గైకొని యహోబలుని బడిలోఁ జేరెను.

అహోబలుఁ డొకయింటిమీఁదినుండి మఱియొకయింటిమీఁదికి దుముకుచు కడవలెత్తి నీరు దిమ్మరించుచుండెను.

బడిలోని వృద్ధబాలురు కావళ్లు బుజములమీఁద నిడికొని ఊడనిఁ బాడుచుండిరి. ఇన్స్పెక్టరు వారిని జూచి "రామయ్యా! కడవ బట్టుకొనక కావడి బట్టుకొని పాఱిపోవుచుంటివా? రా! రమ్ము!" అనెను.

'నేను రామయ్యనుగాను, రమణయ్యను'

'రమణయ్య వయినను రావచ్చును.'

'ఇఁక నాకు బడితో పనిలేదండీ!'

వీ రిటులు సంభాషించుచుండఁగా మిగిలిన వారు దారిలో నున్న వస్తువులను కావడించి కొనిపోయిరి. రమణయ్యయు మాయమాయెను.

అగ్నిహోత్రుని యార్భాటము నవలోకించుచు పలువురు కాపులు తిరుగాడుచుండిరి.

ఇన్‌స్పెక్టరు సైపఁజాలక 'ఏమయ్యా! చెఱువా దూరము కాదు. నీరా శూన్యము కాదు. మీరా అశక్తులు కారు. ఆ పిన్నవారలఁ జూడుఁడు! వారేమి చేయుచున్నారో మీరా పని చేయఁజాలరా?' అని ప్రార్థించెను.

'నరకకుండమువలె తగులఁబడుచున్నది. రండురా నాయనలారా బయటికి' అనఁగా వీరు రాకున్నారు. పైఁగా మమ్ముఁగూడ అందులోఁ బడి చావ మందు రటండీ మీ రెంత ఇన్‌స్పెక్టరుగా రయినను?' అని వా రందఱును దొంగతనమునకు సందుగొందులలోఁ జొరఁబడిరి.

'ముదుసలి చచ్చె, ముదుసలి చచ్చె'అని ఆర్తనాదములు వినఁబడెను.

ఆ ముదుసలి నేలలో డబ్బు పాఁతిపెట్టుకొనెను. ఎవరయినను ఎత్తుకొని పోదు రని అతఁడు దానిమీఁదఁ గూరుచుండెను. ఇల్లు కూలెను.

'దేవుఁడు తగులఁబడుచున్నాఁడు, దేవుఁడు తగులఁబడుచున్నాఁ' డని మఱియొక గంభీరనాదము ఉప్పతిల్లెను.

అందఱును 'దేవుఁడు దేవుఁడు' అని యఱచి దేవాలయముకేసి పరుగిడఁదొడఁగిరి.

అహోబలుఁ డిటు లఱచెను—దేవుఁడు అదాహ్యుఁడు. మునిముందు ఈ నర దేవుని భయటికిఁ దీయుఁడు.'

ఈ యఱపులతో అందఱును ఆఁగిరి. అహోబలుఁ డింటిమీఁదినుండి దుమికి కూలిన యింటిలోఁ జొఱఁబడెను. అతనివెంట అతని బడిలోనివారు కొందఱు చొఱఁబాఱిరి.

పొగ నలువంకల నలముకొనెను. మెల్లగా అగ్ని పరివేష్టించెను. భూదేవి రక్తము క్రక్కుకొనుచున్నదా యనునటులు పెద్ద మంట లేచెను.

'అహోబలుఁ డగ్నికుండమునఁ బడె'నని ఘోషపుట్టెను. దాపుననే మఱియొక ఘోష యిటులు వినఁబడెను—'దేవుని దీయఁబోయి వీరవెంకమ్మగారు దేవళములోఁపూఁడిపోయెను'

ఆశ్రమవాసులలో కొందఱు ఇంటిలోపలను మఱి కొందఱు దేవాలయగర్భమునను ప్రవేశించిరి. కొంతసేపటికి ముదుసలితో నహోబలుఁడును, దేవవిగ్రహముతో వీరవెంకమ్మయు వెలికి వచ్చిరి. వారియొడలు కొంచెము కాలెను. ఉత్సాహపూరితు లగు ఆ పిన్నవా రందఱును అంతటితో నాఁగక వరుణదూతలవలె నీరు కుమ్మరింపఁదొడఁగిరి. రమారమి ఒకగంటలో మంటలు చల్లాఱఁదొడఁగెను. ఇన్‌స్పెక్టరు ఆశ్చర్యముగా వారి సంపఱను దిలకించెను.

ఊరిబయటికి లేచిపోయిన స్త్రీలును, శిశువులును మరలి రాఁగడఁగిరి. పాఱిపోయిన భీరువులును, సోమరులును, పెద్దకాఁపులును దిరిగి వచ్చిరి. అచటనచట నక్కియున్న పాలేళ్లు వాకిండ్లముందు కానిపించిరి. గృహా

స్వాములు లేని యిండ్లలోని వెండిబంగారులు పాలేళ్ల పాలాయెను. కాలుచున్న ధాన్యరాసులను కొందఱు ఆర్పఁదొడఁగిరి.

చీఁకటిపడెను. ఆఱుచున్న మంటలు అగ్నిదేవుని అసంతుష్టములగు ముఖములవలెఁ గానవాయెను. కమిలిపోయిన భూదేవత యూరుపులవలె పొగలుచూపట్టెను.

అలసిన వారందఱును శయ్యలపయి చేతులను గాళ్లను పాఱఁజాచి నిదురించిరి.

అహోబలుఁడును, ఆశ్రమవాసులును పోయినది పోఁగా మిగిలిన దిక్కులేనివారి ఆస్తిని కాపాడుటకు ఆరాత్రి యెల్ల వంతులు వేసికొని గస్తు తిరిగిరి.

మఱునాఁటి ప్రొద్దున ఇన్‌స్పెక్టరు ఆలోచించుచుఁ గూర్చుండెను. వెనుకటినాఁటి ప్రొద్దుటి అహోబలుఁడు వేఱుగను, మాఁపటి అహోబలుడు వేఱుగను, వెనుకటినాఁటి ప్రొద్దుటి వీర వెంకమ్మ వేఱుగను మాఁపటి వీరవెంకమ్మ వేఱుగను అతనికిఁ దోఁచెను. ప్రొద్దుటి అహోబలుఁడో బయ్య; మాఁపటి యహోబలుఁ డహోబలుఁడు; ప్రొద్దుటి వీర వెంకమ్మ యెంకమ్మ. మాఁపటి వీర వెంకమ్మ వీరవెంకమ్మ. అహోబలుఁడు మనుష్యదేవతను బ్రతికించుకొని వచ్చెను. వీరవెంకమ్మ ఈశ్వరుని బ్రతికించుకొని వచ్చెను. ఈ రెండు సాహసములను ఇపుడు మనోనేత్రమునఁ జూచుచున్న ఇన్‌స్పెక్టరుశరీరమునందలి ప్రతి రోమమును నిక్కపొడిచెను.

అతఁడు కలమును కాకితమును చేతఁగొని వార్తాపత్రికలకు ఇట్లు వ్రాసెను:

"నేను శివాగ్రహారమున ఎలిమెంటరీ బడిని పరీక్షింపఁబోతిని. అచట అహోబలుఁడుగారిచే స్థాపింపఁబడిన ఆశ్రమమును జూచితిని. నేను చూచుచుండఁగనే ఆశ్రమపుగోడ విఱిగి పడెను. ఆ సాయంకాలమున గ్రామము తగులఁబడెను. అహోబలుఁడుగారును, వారిజనని వీర వెంకమ్మగారును, ఆశ్రమ బాలకులును మంటలలో దుమికి చాలఁ బ్రాణములను కాపాడిరి. మంటలలో మునిఁగిన మనుష్యుని అహోబలుఁడును, దేవవిగ్రహమును వారితల్లియు బయటికిఁ దెచ్చిరి. ఇంత సాహసము ఎన్నఁడును నేను కని విని యుండలేదు.

ఇపు డీయాశ్రమమునకు ధన మత్యావశ్యకము. చేతు లున్నవా రందఱును చందా లొసఁగవలెను. ఇపుడు చేయుదానమే దానము—"దాతవ్య మితి యద్దానం దీయతే ఒనుపకారిణే—"

అని వ్రాసి అహోబలుని చిరునామాతో ముగించెను. సర్కారువారికి మఱియొక విన్నపమును తయారుచేసి అహోబలుని కొఱకు ప్రతీక్షించుచుఁ గూర్చుండెను.

స్నాన సంధ్యా ద్యనుష్ఠానము లొనరించిన పదఁపడి అహోబలుఁడు ఇన్‌స్పెక్టరుగారికడకు వచ్చి ధన్యవాదము లొనరించెను. ఇన్‌స్పెక్టరు అహోబలుని వీఁపు తట్టి తాను వ్రాసిన విన్నపముల నమోనాలను జూపెను.

అహోబలుఁడు సంతసించి యిటులనెను: "త్యాగశీలు రెవరేని యిచటికివచ్చి పనిచేయుట ఆవశ్యకముగా నున్నదిగాన అట్టి ప్రార్థనగూడ మొకటి విన్నపమునఁ జేర్పఁగోరుచున్నాను."

ఇన్స్పెక్టరిటులనెను—"ఈచిన్నపల్లియకు ఎవరువచ్చి పనిచేయుదురు? అది అనావశ్యకము."

అహోబలుఁ డిటు లనెను—"కాదు; ఆప్రార్థనగూడఁ జేర్పుఁడు."

"ఎవరు వత్తురు మీయూహా?" అని ఇన్స్పెక్టరు ఒత్తి పలికెను.

"దైవ మెవరిని ప్రేరించునో వారు వత్తురు" అని అహోబలుఁ డనెను.

ఇన్స్పెక్టరు నవ్వుకొని అనిష్టముతో అహోబలునిమాట దానఁ జేర్చెను. పిదప నతఁడు అహోబలుని ప్రశంసించి వీరవెంకమ్మ కడ సెలవుగొని మఱొకబడిని బరీక్షించుటకు గ్రామాంతర మరిగెను.

౧౮

ఈ విన్నపము ప్రకటింపఁబడిన నెలవఱకు అహోబలుఁడు నోరుకట్టుకొని యుండెను. పిదప నొకనాఁడు 'నాకు మనియార్డరు లేమయినను రాలేదా?' యని తపాలాజవాను నడిగెను. 'రాలేదు' అని అతఁడు బదులాడెను.

మఱితడవ తపాలావాఁడు రాఁగానే అహోబలుఁడు 'మనియార్డరు రాలేదా' అని యడిగెను. 'రాలేదండీ' అని వాఁడు ప్రత్యుత్తరించెను.

ఇట్టి ప్రశ్నోత్తరములు అహోబలునకును తపాలావానికిని విసువు విరామము లేక జరుగఁదొడఁగెను. కాని తుదకు ఉత్తరము చెప్పుటలో తపాలావానికి కష్టము కలుగఁజొచ్చెను.

ఇది యిటులుండఁగా నొకనాఁడు తహసీలుదారు వచ్చెను. రెవిన్యూ ఇన్స్పెక్టరు వచ్చెను. ఊరివా రందఱును అహోబలుని కడకు వచ్చిరి. అహోబలుఁడు లోలోపల నానందించెను. అందఱును గలిసి చేతులు కట్టుకొని తహసీలుదారువారి దర్శనమున కరిగిరి.

అహోబలుఁడు తహసీలుదారునకు నమస్కరించెను. అతఁడు తల యూఁపెను. పిదప నహోబలుఁడు రెవిన్యూఇన్స్పెక్టరుకు నమస్కరించెను. అతఁడు ప్రతివందనము చేసెను. గ్రామస్థు లందఱును తహసీలుదారుగారికిని రెవిన్యూఇన్స్పెక్టరుగారికిని దండప్రణామము లాచరించిరి.

తహసీలుదారుగారిటులడిగిరి—'అహోబలుఁ డెవరు?'

'నేను.'

'మీగ్రామమున నష్టపు మొత్త మెంత?'

'సరి యయిన లెక్క తెలియలేదు.'

'అంత లెక్కలేనిపని యేల చేసితివయ్యా? పోనీ; సుమారు?'

'ఏఁబది రెండిండ్లు ధనధాన్యములతో దగ్ధమయిపోయిన. సుమారు నాలుగువందల మందికి అన్నము లేదు.'

'అన్నము లేకున్న సరకారువారు చేయునది సున్న. ఎవనియన్నము వాఁడు తిన వలయును. కాలిపోయినవి పెంకు టిండ్లా, పూరిండ్లా ?'

'పూరిండ్లు.'

'పూరిండ్లకు ఇంత హడావడియా? దీనికి అర్జీలు, విన్నపములు వగైరాలా ? లోకమున ఎన్నెన్ని గ్రామములు తగులఁబడుటలేదు ? సరికాని ఇఁక ఇట్టి పిచ్చిపిచ్చి అర్జీలు పెట్టకుఁడు. బంజరులోని తాటాకు కొట్టుకొనుటకు ఆర్డరు వేసెదను. ఇండ్లు కప్పుకొనుఁడు.'

అహోబలుఁ డీమాటలకు తెల్లఁబోయెను. ఎటులెటులో ధైర్యము తెచ్చుకొని 'కలప లేనిదే ఆకు లెందులకు ?' అనెను.

'కొండంత దేవరకు కొండంత పత్రి యెవరు పెట్టఁగలరు ? కలపే తెచ్చుకొనుఁడు; ఆకు లిచ్చెదము' అని తహసీలుదారుగారు మఱొక మకాముకు బయలుదేరిరి.

రెవిన్యూఇన్స్పెక్టరును, జవానులును రక కూరుచుండలేదు; చాటుగా చేయి జాఁపిరి. తహసీలుదారువారి సిబ్బంది యంతయు కొలఁదిసేపటిలోనే వెళ్లిపోయెను.

సరకారువారు చాల సాయము చేయఁగలరని అహోబలుఁ డనుకొనెను. కనీసము కలపయయినను ఈఁగల రనుకొనెను. కాని వా రిచ్చినవి ఆకులు.

ఈ యాఘాతముతో అహోబలుఁడు ఛాయనుండి సత్యపు ఎండను కొంచెము చూడఁగలిగెను. దరిద్రుల స్థితిని ఆలోచించుచు ఇంటికి మరలుచుండఁగా తపాలాజవాను ఎదురుగా వచ్చుచుండెను. అతఁ డహోబలుని జూచి నిలువఁబడియెనుగాని అహోబలుఁ డతని జూడను లేదు; ఏమియు నడుగను లేదు.

తపాలావాఁ డిటు లనెను—"అయ్యా! రానియపుడు 'మనియార్డరు వచ్చెనా? మనియార్డరు వచ్చెనా?' యని యడిగితిరి. వచ్చినపుడు మాటాడరు."

అహోబలుఁడు తలయెత్తి 'మనియార్డరు వచ్చెనా ?' అని యడిగెను.

'వచ్చెను.'

'ఎంత?'

'ఒక అణా.'

అహోబలుఁడు తెల్లఁబోయి చూచుచు నిలువఁబడిపోయెను. తపాలావాఁడు మనియార్డరు ఫారము చేతి కిచ్చెను.

సహాధ్యాయుఁడు వెంకటరావుచే అది పంపఁబడియెను. అహోబలుఁడు దానిని బాఱఁ జూచుచు ఆలోచనోన్ముఖుఁ డాయెను.

తపాలావాఁడు ఇటు లనెను—'దీనికొఱకు ఎన్నోనాళ్లనుండి వాచారించుచుండితిరే! చేవ్రాలు చేయరేమి ?'

అహోబలున కీమాటలు వినరాలేదు. నిర్నిమేషమయిన యతని చూపు తపాలావానికి అక్కఱజము కలిగింపఁగా నతఁ డిటు లనెను—'వాపసు చేయనా ?' అహోబలుని

కీ మాటయు వినఁబడలేదు. వాపసుచేయుటకును పుచ్చుకొనుటకును నడుమనే అతఁడుండెను.

కొంతవడికి 'దైవప్రేషితము తృణమయినను కణమయినను స్వీకరింపఁ దగినదే' యని యతనికిఁ దోఁచెను. వెంటనే యిటులనెను —
'కలము కలదా?'

'కలదు.'

అహోబలుఁడు కలముఁ గొని వ్రాలొనరించి అణా తీసికొనియెను.

తపాలావాఁడు చేయి జాఁపి 'బహుమతి దయచేయరా?' అని నవ్వెను.

అహోబలుఁడు జేబు తడిమి రూపాయ తీసియిచ్చెను. తపాలావాఁడు తీసికొని నిర్విణ్ణత చెందెను.

పిదప పదిరోజులలో తపాలావాఁ డహోబలుని జూచి నమస్కరించి 'అయ్యా! మనియార్డరు' అనెను. అహోబలుఁ డతనిని జూచి యూరకుండెను. తపాలావాఁడు మనియార్డరు ఫారము చేతి కిచ్చెను.

పూర్ణచంద్రరావు నూఱు రూకలంపెను. దానిని జూడఁగనే అహోబలుని కను లశ్రువులు కురిసెను.

తపాలావాఁ డీతూరి యేమియు నడుగలేదు. అనంతర మొకనెలకు తపాలావాఁడు వచ్చి అహోబలునితో 'అయ్యా! తమ కొక వేయిరూకలు ఇన్సూర్ వచ్చిన' దని చెప్పి పోయెను. అహోబలుఁడు వెంటనే సమీపగ్రామమున నున్న తపాలాకచేరికి నడచి పోయెను.

ఆ యిన్సూర్యు సీతయనుదానికడనుండి వచ్చెను. అహోబలుఁ డాపేరు చూచి యాఁగిపోయెను. పోస్టుమాస్ట రతనిని జూచి 'ఏమండీ! అటులు చూచుచున్నారు?' అనెను. 'నాకుఁ గొంచెము వ్యవధి కావలయును. తీసికొనుటయో త్రిప్పి పంపుటయో కొంచె మాలోచించి కొనవలయును' అని యహోబలుఁడనెను. 'మంచిది. ఆలోచింపుఁడు' అని పోస్టుమాస్ట రనెను.

అహోబలుఁడు వాకిటఁ గూరుచుండి యాలోచించెను. ఆలోచించి యాలోచించి సీత వసుమతియని తలపోసెను. 'అగుచో వెంకటరావు — అణాకును, పూర్ణచంద్రరావు నూటికిని, వసుమతి వేయికిని సంఖ్యామాత్రభేదముకాని యీవిలో నేమియు తేడాలే'దని యనుకొని కొంచె మాలోచించెను. 'మొదటి దానము నన్ను ఉపహసించెను. రెండవది నన్ను అభినందించెను. మూఁడవది నాతప్పు నాకుఁ దెలిపెను.' అని యనుకొనెను. పిదప మెల్లగాలేచి గవాక్షముకడ కరిగి 'అయ్యా! పుచ్చుకొందును' అనెను.

పోస్టుమాస్టరు వ్రాలు చేయించికొనెను. అహోబలుఁడు సీళ్లు పరీక్షించి విప్పి చూచుకొని హాసన్ముఖముతో గృహోన్ముఖుఁడాయెను.

నాటి సాయంకాల మహోబలుఁ డొక చిన్నసభ చేసెను. వచ్చిన రూపాయలు చూపెను. కలహకారులకు అందఱకును సమముగా పంచిపెట్టెను. గ్రామము తగులఁబడుచుండఁగా భయఁపడి పాఱిపోయినవారును, సోమరులై చూచుచు నిలువఁబడినవారును, దొరకినసొమ్ము దోఁచుకొని పోయినవారును మిగిలినవారును ఆధనమును సమముగా ననుభవించిరి.

దీనితో నహోబలునకు పైబరువు కొంత తగ్గెను. పిదప మూణ్ణాళ్లు యోజించి ఒకచీటి వెంకటరావునకును, మఱియొకటి పూర్ణచంద్రరావునకును ఇంకొకటి సీతకును ఈరీతిగా తయారుచేసెను:—

"వెంకటరావుగారి సన్నిధిని, నమస్కారములు.

తమ యుపహాసమువలననే నా కీమాత్రపు తెలివితేఁటలు కలిగెను. మీదానమును మనఃపూర్వకముగా గ్రహించితిని. ఎల్లపుడును ఇట్టి యుపహాసముతోడనే నన్ను విమర్శింతురని ఆసింతును.

పూర్ణచంద్రరావుగారి సన్నిధిని, నమస్కారములు.

మీదానమును చేతులొగ్గి గ్రహించితిని. పలువురు దరిద్రనారాయణులను మీ రారాధించితిరి. కాని నాకు ఇసుమంతయేని పరిహాసభిక్ష నిడరయితిరి.

సీతగారి సన్నిధికి.

పలువురు దరిద్రుల చేతులతో మీదానమును గ్రహించితిని. మీదానమును మా యాశ్రమమున శిలాక్షరము చేయుటకు అనుమతింపఁగోరుచున్నాను. ఇంత గొప్ప యీవి యిచ్చిన మీ సలహాలను మెలఁకువతో ననుసరింతును. ఇంకను మీ సాయ మపేక్షితము".

ఈమూఁడును తయారయిన పిదప టపాలోఁ బడుట కాలస్యము కాలేదు. వెంకటరావు కండనుండియు, పూర్ణచంద్రరావు కడనుండియు ప్రత్యుత్తరము రాలేదు కాని సీతకడనుండి వెంటనే యీ ప్రత్యుత్తరము వచ్చెను:

"అయ్యా!

పాదాభివందనములు. నాపేరునకు 'గారు' తగిలింపవల దని మనవి. నే నొకరి దాసిని. మా యేలికసాని తమకు ధనము పంపవలసిన దని యానవెట్టఁగా నే నంపితిని. తమ చీటికి ప్రత్యుత్తర మీదిగువ:

మీ సహస్రబాహువులకును స్వాగతము. నాదానమును శిలాక్షర మొనరింప నే నొల్ల.

తమరు ఇంకను నాసాయ మపేక్షించితిరి. ఇంకొక వేయిరూకలు పంపుచున్నాను."

అహోబలుఁ డీచీటిని, వేయిరూకలను అందుకొనెను. రూకలు దాఁచెను. వెంటనే యిటులు ప్రత్యుత్తరించెను:

"తమ రూకలు నిలువచేసితిని. త్యాగపూర్వకమగు సేవయు, ధనమును మాకు అత్యావశ్యకములు. విశేషించి ధనము. తాము

ఈరెంటికిని సమర్థ లని గంపెడాసతో నున్నాను."

దీనికి వెంటనే యిట్లు జాబు వచ్చెను: "మీకోరికలో మొదటిదానిని నేను కొలఁది యో గొప్పయో నెఱవేర్పఁగలను. మీగ్రామములోని నిఱుపేదలకు పరులొసఁగు ధనమే అత్యావశ్యక మని నమ్మునెడల మీ రింకను మాయలోనే యున్నారుగాని సత్యములో లేరు. మఱియు మీగ్రామచరిత్ర మంతయు మీరవగతము చేసికొనలే దనుకొందును."

అహోబలుఁ డీచీటిని జూచికొని దీర్ఘాలోచన మొనరించి యిట్లు ప్రత్యుత్తరము వ్రాసెను:

"తమ చీటిలోని మాటలను కొన్నిఁటి నెఱిఁగికొంటిని. నే నెట్టి మాయలో నుంటినో తెలియఁజాలను. మా గ్రామచరిత్రము మీ రెట్టు లర్థము చేసికొంటిరో తెలుపఁగోరెదను."

ఈ యుత్తరము వెంటనే టపాలోఁ బడెను గాని ప్రత్యుత్తరము వచ్చుటకుఁ గొంచె మాలస్య మాయెను.

౧౬

కొడుకున కింకఁ బెండిలి కాదని వీరవెంకమ్మ దిగులు పెట్టుకొనెను. అస లామె 'భోలా విశ్వనాథే' కాని. కోడలిముచ్చట మాత్రము నాలుకమీఁదికి రానీదు. అహోబలుఁ డొకనాఁడు ఉత్తరములను పరికించుకొనుచుండఁగా దాపునఁ గూరుచుండి తల్లి కంట నీరు పెట్టుకొని యిట్లనెను—"నాయనా ఆనాఁటి యగ్రహార మీనాఁటికి మాన్య మాయెను. చెట్టంతకొడుకవు చీమంత అయిపోవుచుంటివి. ఇల్లుగూడ నింక ఆశ్రమమే కావలసియున్నదా?"

అహోబలుఁడు తాను పరికించుచున్న ఉత్తరములను క్రిందనుంచి విశాలమగు ముఖముతో విప్పారిన కన్నులతో 'అమ్మా! వరహాలవంటి మాటయంటివి. ఎవరి యిల్లు ఆశ్రమ మగునో వారు ధన్యులుకదా!' అనెను.

వీరవెంకమ్మ కనుఁగొనలనుండి రెం డశ్రుబిందువులు క్రిందికి జాఱెను. అహోబలుఁ డది చూచి—"అమ్మా! కొలఁదిరోజులలోనే"—అను వాక్యమును సమాప్తి చేయకమునుపే వీరవెంకమ్మ అందుకొని 'కోడలు వచ్చునా?' అనెను.

'రావచ్చును.'

వీరవెంకమ్మ మేనుఁ గెక్కెను. 'కోడ లెవరు? వసుమతియా మఱొకతెయా?' ఈ మొదలగు ప్రశ్నములతో నామెకు పని లేకపోయెను. కోడ లనిన కోపించు కుమారుని నోటినుండి 'కోడలు రావచ్చు'నను మాటయే యామెకు సరిపోయెను. వీరవెంకమ్మ 'వేయేండ్ల ఆయుస్సు' అని దీవించి నగుమొగముతో వంటింటిలోనికిఁ జనిెను.

తపాలావాఁడు రెండు ఉత్తరములను తెచ్చియిచ్చెను. అహోబలుఁడు ఒకటి విప్పి చూచుకొనెను:—"మీ . . పరిగ్రహించుచో నాకడ నొక కన్య కలదు."

ఈవాక్యము చదువుకొనుచుండఁగా తన కనులమెదుట వసుమతి నిలిచి యున్నటు లాయెను. అతని శరీరము రోమాంచిత మాయెను. కొంతసేపు మనస్సునం దానందించి యతఁడు 'అమ్మా!' యని పిలిచెను.

'ఏమి నాయనా?'

'స్కూళ్ల యిన్‌స్పెక్టరుగారు తమకూఁతు నిత్తుమని వ్రాసినారు.'

ఈమాట వినఁబడఁగానే వీరవెంకమ్మకును వసుమతి గోచరించెను.

'నాయనా! తొందరగా ఆలోచించుకొనుము' అని లోని కరిగెను.

అప్పాలబలుఁడు రెండవచీటి విప్పెను. అదొక పెద్ద బుక్ పోస్టు. అది సీతకడనుండి వచ్చెను:

"నా యుత్తరమును మీరు శాంతముగ" పరికించినందులకు వందనములు. సిదప.

మీ గ్రామమున జనాభా రమారమి—	౧౫౦౦
తురకలు	౩౦
నిమ్న జాతులు	౩౦౦
అక్షరజ్ఞానము కలవారు	౨౦
చదువుకొనువారు	౬౧
స్త్రీలు	౯౦౦
పురుషులు	౬౦౦
నలుఁబదికి యిరువదికి నడుమవారు	౭౦౦
ఇరువదికి లోపువారు	౮౦౦
ముప్పొద్దులు తిండిగలవారు	౪౦౧
ఒకపూఁటమాత్రము ,,	౫౦౦
తిండిలేనివారు	౬౦౦
ఆయకట్టు ఎకరములు	౧౩౧౭
ఊరి మొత్తపు ఋణము రూ.	౨౦౦౦౦౦
పంట, సుమారు, పుట్లు	౧౦౦౧
తాకట్లు	౯౦౦
పార్టీలు సుమారు	౬
అమలులో నున్న వ్యాజ్యములు	౯౧
వానికిసంబంధించిన జనము (స్త్రీలు, పురుషులు)	౮౦౦
స్త్రీలు	౧౧౦
పెంకుటిండ్లు	౪
పాకలు	౫౯౨
పెద్దబాటలు	౦
సందులు	౩౮
పాడుపడిన దేవళము	౧
గ్రామదేవతల ఆలయములు	౬
ఏటేట బలి యీఁబడు జంతువులు	౫౦౦
చెఱువులు	౧
బావులు	౦
విషూచి వ్యాపించు ఋతువులు	౨
మశూచి ,,	౧

ఇట్టి మీ గ్రామమును పదివేలతో దానమిచ్చినను ఎవరును పరిగ్రహింపరు. సంఖ్యలో భేదమేకాని హిందూదేశమునందలి గ్రామ చరిత్ర మంతయు నొకటియే యని తెలిసికొనఁ గలము.

మీ గ్రామమును ఏటేట పదిపండ్రెండు పర్యాయములు దొంగలు దోఁచికొందురు.

వారిని బట్టుకొనుట కెవరికిని సాహసము చాలదు. మూఁడునాలుగుసారులు గ్రామము దగ్ధమగును. ఎవరును ఆర్పఁజాలరు. చెఱువులో నీరు పురుగులమయము. దానిని బాగుచేయుటకు బదులు దానిచుట్టు అందఱును రోఁత చేయుదురు. వానలు పడునపు డూరంతయు మురిగిపోవును. ఎవరును శుద్ధి చేయరు. విషూచీ మాశూచికలతో ఏఁటేట నేఁబదిమందికిపైఁగా నశింతురు. దానికి సరియగు వైద్య మవలంబించుటకుబదులు పశువులప్రాణములుతీయుదురు.

రైతును పాలేరు నమ్మఁడు. పాలేరును రైతు నమ్మఁడు. ఏరువాక పున్నమ రెణ్ణెల లున్నదనఁగానే పాలేరు చెప్పక చాలించుకొనును. రైతు మూణ్ణెలల గింజలు బిగియఁబట్టుకొని యుండును. దీనితో రైతులకును పాలేళ్లకును అంతులేని అంతఃకలహము.

మీగ్రామమున తురకలయిండ్లు సుమారు పది. జనాభా ముప్పది. చదువు సున్నకును తక్కువ. ఎవరికిని నవాజు రాదు. కాని మతద్వేషము లెస్సగా వచ్చును. మిగిలినవారికిని వీరికిని ఎడ్డమనిన తెడ్డము. ఈద్వేషమును ఎవరును మైత్రిలోనికి పరిణమింపఁ జేయఁజాలరు.

పంట సుమారు ౯౦౦ పుట్లు. వ్యయముపోను నికరపు ఆయము సుమారు (నేఁటి వెలలచొప్పున) ౪౦,౦౦౦. ఆయములో వడ్డీక్రింద పోవలయునది ౩౦,౦౦౦. మిగిలినదానిని పంచుచో తలకు సాలుకు ఏడురూపాయలు పడలేదు.

నిజముపేదలయినను పెండ్లికి వ్యయింపవలయునది ఆయమునకు నాలుగు రెట్లు.

సాఁబాలు జనులు పాటుపడరు. పరుల గుండెలమీఁదనే వారి కాలు. కూరఁగాయలు కష్టించి పండించికొనరు. అప్పు లెగవేసియయినను కొని తిందురు. పశుపోషణమునకుఁగాని, పశువృద్ధికిఁగాని పాటుపడరు. పాడిమాత్రము కావలయును. పురాణము వినరు. చతుర్ముఖపురాణమునకు 'సిద్ధము.' ఇచ్చ వచ్చినటులు వ్యయింతురు. ఖాతా వ్రాయరు. ఇంటికిమూఁడు రోగిశయ్యలు. మందులకును పథ్యపానములకును బదులు దండలకు ముడుపులు. ఇదియంతయు నజ్ఞానమూలకము.

ఇట్టి గ్రామములు భరతఖండమున వేలకువేలు. వీని నన్నిఁటిని ధనము త్యాగమొనరించి యెవఁడు బాగుచేయఁగలఁడు? ఎవనికి సరిపడు ధనమును వానిచేతనే వ్యుత్పత్తి చేయింపవలయు నని మీకుఁ దోఁచుట లేదా?"

అహోబలుఁ డీనివేదికను జదివికొని 'నేను కూపస్థ మండూకమును' అనుకొనియెను. 'లోఁగడ వ్యయమొనరించిన ధనములోఁ జాలపాలు దుర్వ్యయ మొనరించితి' ననుకొనెను. అతఁ డాయుత్తరమును చదివికొని చదివికొని ఆనందముచే జడత్వమును, ఆలోచనచే చలత్వమును పొందఁ దొడఁగెను.

'మా గ్రామచరిత్ర మింత సమగ్రముగాఁ దెలిసికొనిన యీమె వసుమతిగాక మఱెవతె?'

అని అనుకొనెను. బాగుగా యోజించి యిటులు వ్రాసెను:

'మీరు నాయజ్ఞానమును బాపితిరి. మీరు నన్ను స్వీకరించుచో నేను మీవాఁడను. మీరు నాపొరపాటులను దిద్ది లోఁగడనే క్షమించితిరి. ఇఁక క్షమింపు మని యడుగనేల?

నన్ను ధనము గోరితిరి; నేను నిరాకరించితిని. నేను కోరితిని; మీ రిబ్బడిగా నొసఁగితిరి. మీరు మా కతిథు లయితిరి. నేను వెడలనడిచితిని; నేను మరల నిపుడు కోరితిని. మీరు అనుగ్రహించితిరి.

మరల మీరు నా మనోదేవతగను, గృహదేవతగను ఈ యింటిని అధిష్ఠింపఁ గోరుచున్నాను.

పెక్కు కాకితములు పాడుచేసి తుదకీ యుత్తరమును వ్రాయఁగలిగితిని".

సీతకడనుండి వెంటనే యిటులు జాబు వచ్చెను:"మా యేలిక యిటులు వ్రాయమనెను:

మీయుత్తరము చేరెను. తాము సజ్జను లని నాకుఁ దెలియును.

లోకసేవయే ప్రధానముగాఁ బెట్టుకొని జీవికను నిర్వహింపవలయు నని మీరు తలఁచుచో నేను మీ 'గృహదేవతగా' రాఁజాలను. నాకును లోకసేవయే పరమావధి.

ఇట్టి మనకు లోకసామాన్యమగు దాంపత్యము పనికిరాదు. పతనము లేని యలౌకిక దాంపత్యమును అభిలషింతురేని నేను మీమిత్రమను."

అహోబలుఁ డీయుత్తరమును జదివికొని యుప్పొంగెను. వెంటనే వంటింటిలోనికిఁ జని "కోడలు రాఁగలదు" అనెను.

'ఏకోడలు ?'

'వసు—'

వీరవెంకమ్మ ఆశ్చర్యముతో స్తంభించి పోయెను. ఆనందగద్గదమగు నామెకంఠము నుండి 'అమ్మ! నే నిఁక కాశివెళ్లెదను' అనెను.

'మన యిల్లే కాశి.'

'కాకేమి ?'

అహోబలుఁడు వెంటనే యిటులు ఉత్తరము వ్రాసెను:

"ప్రియమిత్రమునకు.

ఇఁక మనకు ఉత్తరప్రత్యుత్తరములతో ఆలస్యమేల ?"

ఈయుత్తరము అందుకొనినపిదప వసుమతి తన మందుల కార్ఖానా నంతయు వాసుదేవరావువశ మొనరించెను. అపు డపుడే పెరిఁగిపోవుచున్న తన ప్రాక్టీసు నంతయు కట్టిపెట్టెను. ఒక రిద్దఱు రోగులనుమాత్రము విడిచిపెట్టి వెళ్లుటకు వీలు కలుగక పోయెను.

సర్దుపాటు లన్నియు అయినపిదప నొక నాఁడు వసుమతి 'సీతా! అమ్మ యెచట నున్నదో చూచి వత్తువా?' అనెను.

'తులసి ముందు.'

వసుమతి మెల్లగా తల్లికడ కరిగి నిలుచుండి 'అమ్మా! రేపు అత్తవారియింటికి వెళ్లుటకు శుభలగ్నము.' అనెను.

'కలయా ?'

'కాదు. ఈయుత్తరములు చూడుము.' అని అహోబలుని యుత్తరములు కొన్ని యిచ్చెను. సోమమ్మ వానిఁ జదివికొని నగుమోముతో 'అమ్మ! నే నిఁక కాశికి వెళ్లెదను' అనెను.

'మన యిల్లే కాశి.'

'కాశియే నాయిల్లు.'

ఆమఱునాఁడు రాధయు వాసుదేవరావును వసుమతియు సోమమ్మయు సీతయు శివాగ్రహారమునకు పయనమయిరి.

వీరవెంకమ్మయు నహోబలుఁడును వినయవిధేయతలతో అందఱను ఉపచరించిరి.

అహోబలునియందు అత్యంతాభిమానముగల గ్రామస్థులందఱును సందుల మొగలన్నియు మావితోరణములతోడను, అరఁటిస్తంభములతోడను అలంకరించి గ్రామమునంతయు మంగళమయ మొనరించిరి.

గ్రామమంతయుఁ బదిరోజులు వేడుకలతో కలకల లాడిపోయెను. వీరవెంకమ్మయు సోమమ్మయు 'భాయి అనఁగా భాయి' అనుకొని కుమారుని కూఁతును ఒప్పించి కాశి కరిగిరి. వాసుదేవరావు పని మానుకొని వసుమతి ప్రాక్టీసును తాను సాగింపఁబోయెను. రాధయు నతనితో నరిగెను.

అహోబలునకును వసుమతికిని గ్రామసంస్కరణముకొఱకు కేంద్రముల నేర్పాటు చేసికొని కర్మయోగ మారంభించుటకు అటుపిదప ఎంతో కాలము జాలము కాలేదు.